సాక్షి
రంగారెడ్డి

మంగళవారం : 23 : ఏప్రిల్ : 2024



ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు..

మాజీ హోంమంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. 8లో▸



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

న్యూస్‌రీల్

పోలీసుల తనిఖీలు



సాగర్‌రోడ్డుపై యాచారం వద్ద ఆర్టీసీ బస్సులో తనిఖీ చేస్తున్న సీఐ శంకర్‌కుమార్

యాచారం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం పోలీసులు సోమవారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. సీఐ శంకర్‌కుమార్ ఆధ్వర్యంలో యాచారం, మాల్, గునుగల్ కేంద్రాల్లో రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు, కార్లు, బైక్‌లు, ఇతర ప్రవేట్ వాహనాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు తరలిస్తే సీజ్ చేస్తామని అన్నారు. సరైన ఆధారాలు లేని పక్షంలో సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

- సకాలంలో వైద్యులు స్పందించ లేదని ఆస్పత్రి వద్ద కుటుంబీకుల ఆందోళన



షేక్ మోహినొద్దీన్ మృతదేహం

చేవెళ్ల: సకాలంలో ఆస్పత్రికి తీసుకువచ్చినా సరైన వైద్యం అందకపోవడంతో వృద్ధుడు మృతి చెందాడని.. మృతునికి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆస్పత్రి వద్ద సోమవారం ఆందోళన చేశారు. ఈ సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శంకర్‌పల్లి మండలం మహాలింగాపురం గ్రామానికి చెందిన షేక్ మోహినొద్దీన్(80) తన బంధువు మహమ్మద్‌ఖాన్‌తో కలిసి ఆదివారం రాత్రి ఇంటి ముందు కూర్చున్నారు. అదే సమయంలో అదే గ్రామానికి చెందిన నందీశ్వర్ అనే వ్యక్తి కారును వేగంగా నడుపుతూ వారిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో వారిని కుటుంబ సభ్యులు వెంటనే శంకర్‌పల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి షేక్ మోహినొద్దీన్ మృతి చెందాడు. మహమ్మద్ ఖాన్ స్వల్ప గాయలతో చికిత్స పొందుతున్నాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే మోహినొద్దీన్ మృతి చెందాడని కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపిస్తూ ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళన చేస్తు న్న వారిని సముదాయించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బ్యూటీ క్లినిక్‌లపై దాడులు



ఓ క్లినిక్‌లో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రాయదుర్గంలోని దీప్తి పర్మినెంట్ మేకప్ అండ్ కాస్మోటిక్ క్లినిక్ సహా మాదాపూర్‌లోని వీ–స్పార్క్ వెల్‌నెస్ క్లినిక్‌పై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం ఆయా క్లినిక్‌లలో తనిఖీలు చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా క్లినిక్స్ నడపడంతో పాటు అర్హులైన చర్మ వైద్యనిపుణులు లేకుండా చికిత్స చేయడం, డ్రగ్స్ లైసెన్సులు పొందకుండా బ్యూటీ ప్రొడక్ట్స్‌ను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఆయా క్లినిక్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

మార్కెట్‌కు పోటెత్తిన మామిడి

సాక్షి, సిటీబ్యూరో: బాటసింగారం మార్కెట్‌కు సోమవారం మామిడి పోటెత్తింది. ఈ సీజన్ లోనే అత్యధికంగా 3,500 వేల టన్నుల మామిడి దిగుమతి అయినట్లు మార్కెట్ అధికారులు వెల్లడించారు. దిగుమతులు పెరగడంతో పండ్ల రకం టన్ను ధర రూ.80 వేలు, మాములు రకం టన్ను రూ.40–50 వేలు ధర పలికింది. దీంతో రిటైల్ మార్కెట్‌లలో పండ్ల ధరలు కూడా తగ్గాయి. గత వారం కిలో మామిడి రూ.90 నుంచి 80 ఉండగా..సోమవారం రిటైల్ మార్కెట్‌లో రూ.70 లోపే ఉన్నాయి. కాగా ఈ ఏడాది మామిడి సీజన్ కాస్త లేట్ అయినా..ఇక నుంచి దిగుమతులు పెరగుతాయని మార్కెట్ అధికారులు చెబుతున్నారు. సీజన్ జూన్ చివరి వరకు కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జిల్లాల నుంచి దిగుమతులు బాగా పెరిగాయని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి చిలుకా నర్సింహారెడ్డి తెలిపారు. ఈ మేరకు రైతులకు మార్కెట్‌లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు.

4 రోజులు 11 నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

కొనసాగుతున్న లోక్‌సభ నామినేషన్ల ప్రక్రియ

- బీజేపీ అభ్యర్థి కొండా, బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని దాఖలు..
- పలువురు స్వతంత్ర అభ్యర్థులు సైతం
- ఇప్పటి వరకు మొత్తం 23కు చేరిన సంఖ్య

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా చేవెళ్ల స్థానానికి నాలుగో రోజైన సోమవారం 11 దాఖలైనట్టు రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. ఇప్పటికే నామినేషన్లు వేసిన ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి తొట్ల రాఘవేందర్, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (సెక్యులర్) పార్టీ అభ్యర్థి మహమ్మద్ సలీం, బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ సోమవారం రెండో సెట్ నామినేషన్ పత్రాలు అందజేసినట్టు పేర్కొన్నారు. వీరితో పాటు భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ప్రజా ఎక్తా పార్టీ అభ్యర్థిగా సానెమ్ రాజ్ గౌడ్, ఆల్ ఇండియా మజ్లీస్–ఇ–ఇంక్విలాబ్–ఇ–మిలాత్ పార్టీ అభ్యర్థిగా మహ్మద్ అబ్దుల్ ఖావీ అబ్బాసీ, స్వతంత్ర అభ్యర్థులుగా జి.మల్లేషం గౌడ్, మహ్మద్ అఫ్సర్ ఖుద్దుస్, ఖడ్గేకార్ శ్రీనివాస్, ఇస్లావత్ పాండు నాయక్, అమీర్ సాజిద్ ఒక్కో సెట్ చొప్పున నామినేషన్లు దాఖలు చేశారని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 23 నామినేషన్లు దాఖలయ్యాయని ఆయన వివరించారు.

సి–విజిల్‌ను సద్వినియోగం చేసుకోండి

చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికలు పారదర్శకంగా జరగడానికి ప్రజలు సి–విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు సి–విజిల్ యాప్ ద్వారా 85 ఫిర్యాదులు రాగా, ఇప్పటికే వాటిని పరిష్కరించినట్టు చెప్పారు. జిల్లాలో ఓటర్లను ప్రలోభ పెట్టినా, భయభ్రాంతులకు గురి చేసినా, బలవంతంగా ప్రభావితం చేసిన సి–విజిల్ యాప్ ద్వారా ఎవరైనా సరే సమాచారం ఇవ్వొచ్చని సూచించారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. అందుకే ఎలక్షన్ కమిషన్ ప్రజల చేతిలో సి–విజిల్ అనే బ్రహ్మాస్త్రం పెట్టిందని అన్నారు. ఆండ్రాయిడ్ మొబైల్ ఉన్న ఎవరైనా సరే సీవిజిల్ యాప్ ను ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. సమస్యను ఎప్పటికప్పుడు కెమెరా ఆన్ చేసుకొని ఫొటో లేదా వీడియో తీసి సమస్యను సంక్షిప్తంగా టైప్ చేసి పంపించాల్సి ఉంటుందన్నారు. సి–విజిల్ ద్వారా చేసే ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచబడుతాయని తెలిపారు. ఎన్నికలు సజావుగా పారదర్శకంగా జరగాలంటే ప్రజలు తమ కళ్లముందు కనిపిస్తున్న అన్యాయాన్ని వెంటనే సి–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. సివిజిల్ యాప్ సురక్షితమైందని, దీనిని ఆపరేటింగ్ చేయడం సైతం చాలా సులువుగా ఉంటుందన్నారు. ఇంగ్లిష్‌లో కానీ తెలుగులో కానీ సమస్యను పంపించవచ్చని అన్నారు. జిల్లా ప్రజలు సి–విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.



నామినేషన్ వేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

కల్యాణం.. అంగరంగ వైభవం

చిలుకూరులో భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు



ఎదురుకోళ్ల కార్యక్రమం

మొయినాబాద్: పచ్చని తోరణాలు.. పూల పందిరి.. మంగళవాయిద్యాలు.. వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య కలియుగదైవం శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాత్రి 11 గంటలకు ప్రారంభమైన శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవిల కల్యాణం అర్ధరాత్రి 2 గంటల వరకు కనుల పండువగా సాగింది. ముందుగా శ్రీవారు వెంకన్నస్వామిని ఊరేగింపుగా తీసుకెళ్లి దేవాలయం సమీపంలోని మండపంలో వేంచేయించారు. అనంతరం అమ్మవార్లను కూడా ఊరేగింపుగా స్వామివారి చెంతకు తీసుకెళ్లి ఎదురుకోళ్ల కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి, అమ్మవార్ల తరఫువారు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. ఆలయ అర్చకులు నృత్యాలు చేస్తూ ఎదురుకోళ్ల కార్యక్రమాన్ని రక్తికట్టించారు. అనంతరం స్వామివారు, అమ్మవార్లను ఊరేగింపుగా ఆలయ గర్భగుడి వెనకభాగంలో ఏర్పాటు చేసిన పెళ్లి పందిరిలో ఆసీనులను చేశారు. వేదపండితులు వేదమంత్రోచ్చరణలతో శ్రీనివాసుని కల్యాణ మహోత్సవాన్ని ప్రారంభించారు. వైష్ణవ సాంప్రదాయం ప్రకారం ముందుగా విష్వక్సేనుని ఆరాధించి శుద్ధివచనం, పుణ్యాహవచనాలు నిర్వహించారు. ఈ మహోత్సవంలో ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ సౌందరరాజన్, కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, తిరుమల కిరణాచారి, పరవాస్తు రామాచారి, నరసింహన్, కన్నయ్య, కిట్టు, సురేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ ప్రాప్తి రద్దు చేసినా..

కల్యాణోత్సవం సందర్భంగా పెళ్లి కానివారి కోసం ప్రకటించిన వివాహ ప్రాప్తి కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు రద్దు చేసినా భక్తులు మాత్రం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం రాత్రి జరిగిన కల్యాణోత్సవంలో పాల్గొనేందుకు పెళ్లి కాని యువతీ, యువకులు చాలామంది రావడంతో ఆలయం బయట స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు స్క్రీన్ ఏర్పాటు చేశారు.

పట్టు వస్త్రాలు సమర్పించిన పంచాయతీ

కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారు, అమ్మవార్లకు చిలుకూరు పంచాయతీ తరఫున పట్టు వస్త్రాలు సమర్పించారు. పంచాయతీ ప్రత్యేక అధికారి సంధ్య, కార్యదర్శి వెంకటేశ్ సిబ్బందితో కలిసి పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు.

స్వామివారికి వాహనసేవలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి వసంతోత్సవం నిర్వహించారు. స్వామివారు, అమ్మవార్లను జగవాహనంపై ఊరేగించారు.

పదేళ్లలో విప్లవాత్మక మార్పులు

బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న అభయ్ పాటిల్

షాద్‌నగర్: ప్రధాని మోదీ పదేళ్ల పాలనలో దేశంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం షాద్‌నగర్ పట్టణంలోని ఏబీ కాంప్లెక్‌లో షాద్‌నగర్, జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అభయ్ పాటిల్ మాట్లాడుతూ.. దేశాభివృద్ధి కోసం బీజేపీ ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. చట్ట సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ల, అయోధ్యలో రామమందిర నిర్మాణం, 370 ఆర్టికల్ రద్దు, త్రిపుల్ తలాక్ వంటి ఎన్నో నిర్ణయాలు తీసుకుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం రూ.లక్ష కోట్లు మంజూరు చేసిందన్నారు. పంచాయతీలు, పట్టణాలు, నగరాలు అన్నీ కేంద్ర నిధులతోనే అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు విశ్వసించడం లేదన్నారు. దేశం మరింత అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమని తమకు అండగా నిలుస్తున్నారని అన్నారు. తెలంగాణలో 12 ఎంపీ స్థానాల్లో తమ అభ్యర్థులు గెలవబోతున్నారని జోస్యం చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి వివరించి ప్రజలను చైతన్య పరచాలని ఆయన సూచించారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ అభ్యర్థి డీకే అరుణను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, బాలత్రిపుర సుందరి, దేపల్లి అశోక్‌గౌడ్, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింహగౌడ్, భూపాలచారి, కక్కునూరి వెంకటేశ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నేడు వీర హనుమాన్ విజయ యాత్ర

సుల్తాన్‌బజార్: హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ తలపెట్టిన వీర హనుమాన్ విజయయాత్రకు సర్వం సిద్ధమైంది. ఉదయం 8 గంటలకు గౌలిగూడ రామ మందిర్‌లో యజ్ఞంతో హనుమాన్ పూజలు ప్రారంభమవుతాయి. 11.30 గంటలకు యాత్ర ప్రారంభమవుతుంది. కోఠి ఆంధ్రాబ్యాంక్ చౌరస్తా వద్ద సామూహిక హనుమాన్ చాలీసా పఠనం, ముఖ్య అతిథులతో బహిరంగ సభ నిర్వహిస్తారు. కర్మన్‌ఘాట్, సైదాబాద్, మలక్‌పేట్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే ఇతర ర్యాలీలు కోఠిలో ప్రధాన యాత్రతో కలిసి తాడ్‌బన్ హనుమాన్ దేవాలయం వరకు కొనసాగుతుంది. హనుమాన్ విజయ యాత్రకు భారీ పోలీస్ బలగాలను మోహరిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. భారీ భద్రత, సీసీ కెమెరాల నిఘా, ఉన్నతాధికారుల పర్యవేక్షణ మధ్య యాత్ర కొనసాగుతుందని తెలిపారు. గౌలిగూడ రామ మందిరం నుంచి పుత్లీబౌలి చౌరస్తా, కోఠి ఆంధ్రాబ్యాంక్ చౌరస్తా, డీఎంహెచ్ఎస్ సుల్తాన్‌బజార్ క్రాస్‌రోడ్స్, రామ్‌కోఠి క్రాస్‌రోడ్, కాచిగూడ క్రాస్‌రోడ్, నారాయణగూడ వైఎంసీఏ మీదుగా చిక్కడపల్లి క్రాస్‌రోడ్స్, ఆర్టీసీ క్రాస్‌రోడ్, అశోక్‌నగర్, గాంధీనగర్ బ్యాక్ సైడ్ వైశ్రాయ్ హోటల్, కవాడిగూడ, బన్సీలాల్‌పేట్, బైబిల్ హౌస్, రామ్‌గోపాల్‌పేట్, ప్యారడైజ్ క్రాస్‌రోడ్ నుంచి తాడ్‌బన్ హనుమాన్ దేవాలయం వరకు ఈ యాత్ర కొనసాగుతుంది. అక్కడ బహిరంగ సభతో ఈ యాత్ర ముగియనుంది. ఈ రూట్లలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

గ్రంథాలయాలు చైతన్య వేదికలు

- గ్రంథ పఠనం చరిత్ర పుటల్ని మారుస్తుంది
- లైబ్రరీలను యువత సద్వినియోగం చేసుకోవాలి
- ప్రొఫెసర్ కోదండరామ్

బొంరాస్‌పేట: గ్రంథ పఠనం యువతను విజ్ఞానవంతులను చేసి, చరిత్ర పుటల్ని మార్చేలా చేస్తుందని ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. సోమవారం కొడంగల్ మండలం సంగాయిపల్లికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు హన్మయ్య తన తల్లిదండ్రుల పేరున ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయాలు చైతన్య వేదికలన్నారు. నిజాం పాలనలో రాజులు, దొరలను ప్రశ్నించే యువతను తయారు చేశాయన్నారు. రజాకార్ల పాలనను కుప్పకూల్చాయని గుర్తుచేశారు. తెలంగాణ యువతను చైతన్యం చేసి స్వరాష్ట్రం ఏర్పాటుకు దోహదపడ్డాయనడంతో సందేహం లేదన్నారు. విద్యార్థులు, యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువతలో అలవాట్లను, ఆలోచన విధానాన్ని మార్చి చైతన్య వేదికలు గ్రంథాలయాలని పేర్కొన్నారు. కాలక్షేపం కోసం టీవీ, సెల్‌ఫోన్ వాడకం సరైంది కాదని, వాటిని తగ్గించి గ్రంథ పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

కొడంగల్ ప్రజలు చైతన్యవంతులు

కొడంగల్ నియోజకవర్గం కర్ణాటక, తెలంగాణ సరిహద్దులో ఉన్నా ఇక్కడి ప్రజలు ఎంతో చైతన్యవంతులని కోదండరామ్ అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో గట్టి పోరాటాన్ని అందించారని ప్రశంసించారు. గ్రంథాలయ ఏర్పాటు కర్త హన్మయ్యను సన్మానించి అభినందించారు. హన్మయ్య తల్లి శివమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రంథాలయంలో తొలి పాఠకుడిగా సంతకం చేసి పుస్తకాలను పరిశీలించారు. పత్రికా ఎడిటర్ కే శ్రీనివాస్, పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు తదితరులు గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. హన్మయ్య సేవలను అభినందించారు. కార్యక్రమంలో శతావధాని మలుగు అంజయ్య, టీపీపీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్, బాకారం చంద్రశేఖర్, గౌరారం గోపాల్, విజయలక్ష్మి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఏనుగుల భాస్కర్, రాధాకృష్ణ, ఎంఈఓ రాంరెడ్డి పాల్గొన్నారు.

బొట్టు బొట్టు ఒడిసిపడదాం..



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: వాన నీటి సంరక్షణపై జీహెచ్‌ఎంసీ అలర్ట్ అయింది. బొట్టు బొట్టునూ ఒడిసి పట్టడం ఎలా అన్న అంశాన్ని ప్రజలకు వివరిస్తూనే..తానూ పాటిస్తోంది. ప్రస్తుతం నెలకొన్న నీటి ఎద్దడి పరిస్థితుల్లో వాననీటి సంరక్షణకు ఇంకుడు గుంతల ఏర్పాటును తప్పనిసరిగా అమలు చేయాలని ప్రభుత్వం సంబంధిత శాఖలను ఆదేశించింది. ఈ నేపథ్యంలో వర్షపునీటి నిల్వ గురించి ప్రజలకు చెప్పేముందు మన కార్యాలయాలకు ఆ ఏర్పాట్లు ఉన్నాయా అని అధికారులను అడిగిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్‌కు లేవని సమాధానం ఎదురైంది. దాంతో ప్రజలకు చెప్పేముందు మనం ఆచరించాలని యూబీడీ, యూసీడీ తదితర విభాగాల అధికారులకు సూచించడంతో ఆ దిశగా పనులు చేపట్టారు.

- జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం భవనంలో ఏడంతస్తులున్నాయి. మొదటి అంతస్తులో ఉన్న సంప్‌లోకి రూఫ్‌టాప్‌లపై పడే వర్షపునీరు పైపుల ద్వారా, ఫిల్టర్ అయి సంపులో పడే ఏర్పాట్లు చేశారు. సదరు నీటిని గార్డెనింగ్‌కు, వాష్‌రూమ్స్‌లలో వాడుకోవచ్చు. ఈ సంపులో 1.2 లక్షల లీటర్ల నీటిని నిల్వ చేయొచ్చు.
- నగరంలో కురిసే వర్షాలతో ఏటా దాదాపు 9 లక్షల లీటర్ల నీరు రూఫ్‌టాప్‌ల ద్వారా పడుతుందని అంచనా. పైపుల ద్వారా సంపులోకి మళ్లించిన నీటిని ఆయా అవసరాల కోసం వినియోగించాక మిగిలిన నీటితో భూగర్భజలాలు పెరిగేలా చర్యలు చేపట్టారు. ఈ మేరకు భవనం ఆవరణలోని ఖాళీ ప్రదేశంలో 17,839 చదరపు మీటర్ల స్థలంలో రీచార్జి పిట్ తవ్వి ఇంజెక్షన్ బోర్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా భూమి పొరల్లోకి వెళ్లే నీటి వల్ల పరిసరాల్లో భూగర్భజలాలు పెరుగుతాయని అధికారులు తెలిపారు.

మేస్త్రీలు, ప్లంబర్లకు శిక్షణ

తాము చేసిన ఈ పనిని చూపుతూ ప్రతి వర్షపు చుక్కను వృథా కాకుండా ప్రజలందరూ ఇళ్లలో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాల్సిందిగా రొనాల్డ్‌రాస్ కోరారు. ఇందుకుగాను ప్లంబింగ్ వర్కర్లు, మేస్త్రీలకు శిక్షణ కార్యక్రమాల్ని జీహెచ్‌ఎంసీలో సోమవారం ప్రారంభించారు. భవిష్యత్ తరాలకు నీటి సమస్యలు రాకుండా ఉండాలంటే వర్షపునీటి సంరక్షణ అవసరమని చెబుతూ అందుకుగాను నిర్మించాల్సిన ఇంకుడుగుంతలపై వారికి శిక్షణనిచ్చారు. అందుబాటులోకి వచ్చిన నూతన విధానాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఈపీటీఆర్ఐ కన్సల్టెంట్, రిటైర్డు ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్, రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ ప్రాజెక్ట్ సీఈఓ కల్పనా రమేష్‌లు వాన నీటి సంగ్రహం, శుద్ధి చేసి తిరిగి ఉపయోగించడం, కాలుష్యాన్ని నివారించడం, రీచార్జ్ పిట్స్, నీటిని నేల పొరల్లో ఇంకించే విధానం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఇంటి కప్పుపై పడ్డ వర్షపు నీటిని ఎలా సంరక్షించుకోవాలో వీడియోల ద్వారా వివరించారు. వీటికి సంబంధించి ఓడీకే యాప్ డౌన్ లోడ్ చేసుకుని సందేహాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు.

24, 25 తేదీల్లో కూడా శిక్షణ

ఈనెల 24, 25వ తేదీల్లో కూడా వర్షపు నీటి సంరక్షణపై ప్లంబింగ్ వర్కర్లకు శిక్షణ నిర్వహిస్తున్నామని, ఆసక్తి గలవారు గూగుల్ ఫారం https://forms.gle/rJnheoVKSEU4VDnJAలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు తమవద్ద పనిచేస్తున్న, తమకు తెలిసిన ప్లంబర్లు, మేస్త్రీలు శిక్షణకు హాజరయ్యేలా చూడాలని జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి కోరారు. శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. ప్రజలువారి ద్వారా ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు.

జలమండలి ఆధ్వర్యంలో..

హైదరాబాద్ నగరంలో భూగర్భ జలాలను పెంచేందుకు జలమండలి, ఈపీటీఆర్ఐ, జీహెచ్‌ఎంసీ సంయుక్తంగా చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్లంబర్స్, మేస్త్రీలకు శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన శిక్షణ కార్యక్రమాన్ని జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వాన నీటి సంరక్షణలో ఇంకుడు గుంతల నిర్మాణం ఎంతో కీలకమన్నారు. అందులో భాగంగానే వాటి నిర్మాణంపై ప్లంబర్స్, మేస్త్రీలకు 3 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వీరంతా ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా ఉంటారన్నారు. జూబ్లీహిల్స్‌లో జలమండలి నిర్మించిన రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ థీమ్ పార్క్‌ను ఈ సందర్భంగా గుర్తు చేశారు. అందులో వాన నీటిని ఒడిసి పట్టే వివిధ పద్ధతులను వివరించారు. శిక్షణ తీసుకుంటున్న వారు ఒకసారి ఆ పార్క్‌ను సందర్శించాలని సూచించారు. మిగిలిన 24, 25 తేదీల్లో శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వారు 8639619366 ఫోన్ నంబరు ద్వారా లేదా eptrienviro@gmail.com కి మెయిల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, రెవెన్యూ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, జీఎం రాజేందర్, ఇంకుడు గుంతల నిర్మాణ ప్రత్యేకాధికారి జాల సత్య నారాయణ, రిసోర్స్ పర్సన్ కల్పన, ప్లంబర్స్, మేస్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ అధ్యాపకుడికి డాక్టరేట్


రాజేందర్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: గురునానక్ ఇన్‌స్టిట్యూషన్ టెక్నికల్ క్యాంపస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న షాద్‌నగర్‌కు చెందిన ఎస్.రాజేందర్‌రెడ్డి జేఎన్‌టీయూ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. 'డైనమిక్ ఓల్టేజ్ రీస్టోర్ అండ్ డిస్ట్రిబ్యూషన్ స్టాటిక్ కాంపెన్సేటర్ ద్వారా వివిధ పవర్ క్వాలిటీ సమస్యలను తగ్గించడం' అనే అంశంపై చేసిన అధ్యాయనానికి జేఎన్‌టీయూ ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రకటించింది. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డిని విద్యావేత్తలు, ప్రముఖులు అభినందించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

పోచారం: బైపోలార్ వ్యాధితో బాధపడుతున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇస్మాయిల్‌ఖాన్‌గూడకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బేతి రమేశ్(40) రెండేళ్లుగా బైపోలార్ వ్యాధితో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్నా వ్యాధి తగ్గలేదు. ఈ వ్యాధి కారణంగా రమేష్ విచిత్రంగా ప్రవర్తించేవాడు. ఈ నెల 21న బీబీనగర్‌లోని జలవిహార్‌కు రమేశ్ భార్య స్వాతి, కుమార్తెతోపాటు స్వాతి సోదరి కుటుంబంతో కలిసి ఈ నెల 21న బీబీనగర్‌లోని జలవిహార్‌కు వెళ్లారు. రాత్రి ఇంటికి తిరిగి వచ్చేసరికి రమేశ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కన్పించాడు. వెంటనే అతన్ని కిందకు దింపి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. రమేశ్ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పరిశోధనలతో సమాజానికి మేలు

- చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేట్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికారెడ్డి

మొయినాబాద్‌రూరల్: సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు నిర్వహించాలని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేట్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో ఉన్న యూనివర్సిటీలో బి.సోమనాథశర్మ భౌతికశాస్త్ర విభాగంలో 'ఏ స్టడీ ఆఫ్ రేడియేషన్ ఇండ్యూజ్ మెడిపికేషన్ ఆఫ్ ఫిజికల్, కెమికల్ ప్రాపర్టీస్ ఆఫ్ సమ్ పాలిమార్ బెస్ట్ మెటీరియల్ అండ్ డేర్ స్టెబిలైజేషన్ యాక్సెప్' అనే అంశంపై ప్రొఫెసర్ ఏ.రాజు పర్యవేక్షణలో పరిశోధన చేశారు. అదే విధంగా గణితశాస్త్ర విభాగంలో 'న్యూ మెరికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ కనెక్టివ్ ఈట్ అండ్ మాక్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ నాన్ న్యూటేనియస్ ఫ్లూయిడ్ ఫ్లో' అనే అంశంపై ప్రొఫెసర్ సుందర్‌రామ్, డాక్టర్ మహ్మద్ షమ్ పర్యవేక్షణలో అశోక్ పరిశోధన చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వీరికి డాక్టరేట్ పట్టాలను సోమవారం అందజేశారు. డాక్టర్ సాత్వికారెడ్డి మాట్లాడుతూ.. పరిశోధనలు నాణ్యతతో కూడినవి ఉంటే అవి సమాజానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రస్తుత కాలంలో ప్రయోగాలు, పరిశోధనలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఉపకులపతి దామోదర్, రిజిస్ట్రార్ రవీందర్, ప్రొఫెసర్ జగదీశ్వర్, క్రిష్టఫర్, పీఆర్వో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


డాక్టరేట్ పట్టాను అందజేస్తున్న డాక్టర్ సాత్వికారెడ్డి

ప్లాస్టిక్ గోదాంలో అగ్ని ప్రమాదం


ఎగిసి పడుతున్న మంటలు

మహేశ్వరం: ప్లాస్టిక్ గోదాంలో అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట గ్రామానికి చెందిన హజీబ్ స్థానికంగా ప్లాస్టిక్ గోదాంను నిర్వహిస్తున్నారు. అందులో ఉన్న యంత్ర విభాగంలో ఉదయం షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో ప్లాస్టిక్ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. సమచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైరింజన్లతో మంటలను ఆర్పివేశాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు కృషి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి
- కౌకుంట్లలో ఆయన సమాధి వద్ద నివాళి


ఇంద్రారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, ఆమె తనయులు, ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల: మాజీ హోంశాఖ మంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కౌకుంట్ల గ్రామంలో ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆమె నివాళులర్పించారు. ఆయన సమాధి వద్ద సబితారెడ్డి, కార్తీక్‌రెడ్డి, కల్యాణ్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, స్థానిక నాయకులతో కలిసి పుష్పగుచ్ఛాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వర్గీయ ఇంద్రారెడ్డి కన్న కలలు ఒక్కొక్కటిగా నేరవేరుతున్నాయన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం చివరి శ్వాస వరకు పోరాడిన ఆయన కల సాకారమయిందన్నారు. ప్రస్తుతం నాయకులు విలువలు లేని రాజకీయాలు చేస్తున్నారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇంద్రారెడ్డి చూపిన మార్గంలో ఆయన అభిమానులు, అనుచరులు ముందుకు సాగుతున్నారని గుర్తు చేశారు. ఈ ప్రాంత ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శివప్రసాద్, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, నాయకులు మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి, శుభప్రదీప్‌పటేల్, మల్లారెడ్డి, గోపాలకృష్ణ, దశరథ్, ఇనాయత్, యాదగిరి, అంజయ్య, హన్మంత్‌రెడ్డి, మాధవ్‌గౌడ్, నాగేశ్వర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, మాధవ్‌రెడ్డి, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిధిలో

చేవెళ్ల మండల కేంద్రంలోని ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే కాలెయాదయ్య, మాజీ ఎంపీపీ ఎం.బాల్‌రాజ్, జి.చంద్రశేఖర్‌రెడ్డి, మండల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఇంద్రారెడ్డి విగ్రహాల వద్ద వర్ధంతిని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు.

కబ్జాదారుల నుంచి భూమిని కాపాడాలి

మంచాల: తాతల కాలం నుంచి కబ్జాలో ఉండి సాగు చేసుకుంటున్న భూమిని ఆక్రమించడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని మండలంలోని ఆరుట్ల గ్రామానికి చెందిన భూ బాధితులు వాపోయారు. ఆరుట్ల రెవెన్యూ పరిధిలోని 1605, 1606, 1607, 1608, 1611, 1612 సర్వే నంబర్లలో జంగయ్య, యాదయ్య, రాజు, రమేష్, జాంగీర్ బాబుమీయా, జయమ్మ తదితరులు పేర్ల మీద ఉన్న ఐదు ఎకరాల భూమిని ధరణిలో ఇతరుల పేర్లపై అక్రమంగా నమోదు చేశారు. రెవెన్యూ అధికారులు తప్పుడు రికార్డులు నమోదు చేసి మాకు అన్యాయం చేయడం ఎంత వరకు సమంజసమని బాధితులు సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. భూమి కబ్జా చేయడానికి కిరాయి గుండాలతో దాడులకు దిగడమే గాకుండా పొలం చుట్టూ ఉన్న హద్దులను తొలగించారని తెలిపారు. గ్రామంలో పూర్తిస్థాయిలో విచారణ చేసి నిజమైన రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వారు వేడుకున్నారు.


ఆక్రమణదారులు తొలగించిన హద్దులను చూయిస్తున్న రైతులు

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


ప్రవీణ్ మృతదేహం

కొత్తూరు: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొత్తూరు మండల పరిధిలోని సిద్ధాపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ప్రవీణ్(27) వ్యవసాయ పనులు చేసుకుంటూ తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి అతడు తిరిగి రాలేదు. ఉదయం పొలానికి వెళ్లిన తండ్రి అంజయ్యకు చింతచెట్టుకు ఉరేసుకుని ప్రవీణ్ విగతజీవిగా కనిపించాడు. వెంటనే చుట్టుపక్కల వారి సహాయంతో కిందకు దించగా అప్పటికే అతడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతికి సంబంధించి కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మేకల మందపై కుక్కల దాడి

15 జీవాలు మృత్యువాత


మేకల కళేబరాలు

షాద్‌నగర్: మేకల మందపై కుక్కలు దాడి చేయడంతో 15 మేకలు మృత్యువాత పడిన ఘటన సోమవారం ఉదయం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కొండన్నగూడలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మల్లయ్య వద్ద ఉన్న మేకల మందపై వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో 15 మేకలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. సుమారు రూ.3 లక్షల వరకు నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయారు. కుక్కల నివారణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని ఆయన వేడుకున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


దశరథ్ చారి (ఫైల్)

పహాడీషరీఫ్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన దశరథ్ చారి(56) భార్య చనిపోవడంతో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. ఈ నెల 16వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. ఆచూకీ కోసం గాలించినా ప్రయోజనం లేకపోవడంతో, దశరథ్ సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

భార్య కాపురానికి రాలేదని వ్యక్తి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: పుట్టింటికి వెళ్లిన భార్య రావడం లేదని... ఆర్థిక ఇబ్బందులు అధికంగా ఉన్నాయని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన సాహిత్ ఇస్లాం(23) పేట్ బషీరాబాద్ సమీపంలోని కార్మిక అడ్డాలో నివాసం ఉంటున్నాడు. ఇతడికి ఏడు నెలల క్రితం వివాహమైంది. రెండు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రాకపోవడం లేదని.. ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని తోటి కార్మికుల వద్ద వాపోయేవాడు. ఈ క్రమంలో స్థానికంగా నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో పనిచేస్తున్న ఇస్లాం ఆదివారం రాత్రి 10.30 సమయంలో ఇంట్లోకి వెళ్లి ఉరేసుకున్నాడు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


జూబ్లీహిల్స్‌లోని సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు: పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందడానికి బీజేపీ, బీఆర్ఎస్‌లు అవకాశవాద రాజకీయాలు చేస్తున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్‌లకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తల్ మండలాలలో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్‌ల కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్లమెంటు ఎన్నికలలో బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓటమి తప్పదని ఆయన అన్నారు. ఎన్నికలలో రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ 14కు పైగా స్థానాలలో విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన కొనసాగుతుందని, ప్రజల నుంచి కాంగ్రెస్‌కు మంచి ప్రజాదరణ లభిస్తుందని ఆయన చెప్పారు. ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. అంతకుముందు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు బిజినెపల్లిలో సీఎం బహిరంగ సభ

నాగర్‌కర్నూల్ జిల్లా బిజినెపల్లి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించే బహిరంగసభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి నామినేషన్ కార్యక్రమంలో సీఎం పాల్గొని అనంతరం బిజినెపల్లి బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారని ఆయన చెప్పారు. రేవంత్‌రెడ్డి సభకు కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని ఎమ్మెల్యే కసిరెడ్డి కోరారు. కార్యక్రమంలో గూడూరి శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, జక్కు అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలపై దాడులు

యాచారం: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం యాచారం పోలీసులు బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించారు. సీఐ శంకర్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న కిరాణా దుకాణాల్లో తనిఖీలో నిర్వహించి గ్రామానికి చెందిన యాదయ్య వద్ద నుంచి రూ.3 వేలు విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్: స్కూల్‌బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మల్కారంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దార కృష్ణయ్య(55) సోమవారం రోడ్డు దాటుతుండగా శంషాబాద్ నుంచి షాబాద్ వైపు వెళ్తున్న బ్రిలియంట్ స్కూల్ బస్సు అతడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన కృష్ణయ్యను ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టా భూమి కబ్జా చేస్తున్నారు..

శంషాబాద్ రూరల్: తన పట్టా భూమిని కొందరు రియల్టర్లు కబ్జా చేస్తున్నారని ఆరోపిస్తూ ఓ మహిళ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్దతూప్ర గ్రామం సర్వే నంబర్ 106లో కాసిరెడ్డిగూడెం సుజాత అనే మహిళకు ఆమె తండ్రి కట్నంగా మూడు ఎకరాల పొలం ఇచ్చాడు. దాయాదుల పొలాల మధ్యలో సదరు భూమి ఉంది. వారి దాయాదుల నుంచి భూమిని కొనుగోలు చేసిన రియల్టర్లు సుజాత భూమిని కూడా చదును చేసి కబ్జాకు యత్నిస్తున్నారు.

పిడుగుపాటుకు గేదెల మృతి

- జీవనోపాధి కోల్పోయామని రైతు ఆవేదన


మృతి చెందిన గేదెల వద్ద బాధిత రైతు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని చిన్న మంగళారం గ్రామంలో ఆదివారం రాత్రి పిడుగు పడి రెండు గేదెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన గునుగుర్తి సత్యనారాయణగౌడ్‌కు చెందిన రెండు గేదెలు తన వ్యవసాయ పొలం వద్ద కట్టేశారు. రాత్రివేళ వర్షంతో పాటు ఉరుములు, మెరుపులు రావడంతో పిడుగుపడి అవి మృతి చెందాయి. ఉదయం పొలానికి వెళ్లిన సత్యనారాయణగౌడ్ మృతి చెందిన గేదెలను చూసి రోదించారు. రూ.1.2 లక్షల నష్టం వాటిల్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమ జీవనోపాధి కోల్పోయామని విలపించారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నారు.

రౌడీషీటర్ హత్య కుట్ర భగ్నం

- నిందితుడి అరెస్ట్

చాంద్రాయణగుట్ట: రౌడీషీటర్ హత్య కుట్రను బహదూర్‌పురా పోలీసులు భగ్నం చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. పురానీహవేలీలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య వివరాలు వెల్లడించారు. ఫలక్‌నుమా నవాబుసాహెబ్ కుంటకు చెందిన మహ్మద్ అలీ(24) మూడేళ్ల క్రితం ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో మహ్మద్ ఆరీఫ్ అనే యువకుడిని హత్య చేసి జైలుకు వెళ్లాడు. 2022లో జైలు నుంచి విడుదలయ్యాడు. ఈ నెల 11న రంజాన్ పండుగ రోజు మహ్మద్ అలీ సోదరుడు ఫహద్ అలీతో కాలాపత్తర్ రౌడీషీటర్ మహ్మద్ ఇస్మాయిల్ గొడవపడ్డాడు. మూడు రోజుల అనంతరం నవాబుసాహెబ్ కుంటలో మహ్మద్ అలీ కనిపించగా చంపుతానని ఇస్మాయిల్ బెదిరించాడు. దీంతో ప్రాణహాని ఉందని గ్రహించిన మహ్మద్ అలీ ఎలాగైనా ఇస్మాయిల్‌ను అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో మీరాలం ట్యాంక్ సమీపంలో పోలీసులు తనిఖీ చేస్తుండగా మహ్మద్ అలీ వద్ద కత్తి లభించింది. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా హత్య కుట్ర వెలుగులోకి వచ్చింది. విలేకరుల సమావేశంలో దక్షిణ మండలం అదనపు డీసీపీ షేక్ జహంగీర్, బహదూర్‌పురా ఇన్‌స్పెక్టర్ ఆర్.రఘునాథ్, ఎస్సై బిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీపై చర్యలు తీసుకోవాలి

- విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి విన్నవించిన ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో ఫీజుల దోపిడీపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి పెరిక సురేష్, బీసీ నేతలతో సోమవారం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని వెంటనే తీసుకురావాలని కోరారు. శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలు ఇంటర్‌లో రూ.3 లక్షల నుంచి రూ.3.50 లక్షలు, పాఠశాల స్థాయిలో రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వసూలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఫీజులు చెల్లించలేక అనేక మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, నందగోపాల్, రాజేందర్, జయంతి, మోదీ రాందేవ్, చంద్రశేఖర్, నిఖిల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.